క్లుప్తంగా

వర్షంలోనూ ఆగని బడిబాట



వర్షంలోనే బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల గ్రామాలలో సోమవారం వర్షంలో సైతం బడిబాట కార్యక్రమం నిర్వహించామని ఎంఈఓ విఠల్ చెప్పారు. మండలంలోని బండపోతుగల్, సామ్లాతండా, అంతారం గ్రామాలలో సోమవారం ఉపాధ్యాయులు, చిన్నారులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ వర్షంలోనే బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో ఉచిత పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫారాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. డ్రాపౌట్స్‌గా ఉన్న విద్యార్థులను తప్పనిసరిగా పాఠశాలలో చేరేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

గ్రామ దేవతలకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. మొదటిరోజు పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

పంట మార్పిడితోనే లాభాలు



సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

తూప్రాన్: పంట మార్పిడితోనే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వారితో కలిసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని సోమవారం నర్సంపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ రాజశేఖర్ (కీటక శాస్త్రవేత) మాట్లాడుతూ యూరియా వాడకం తగ్గించడం వల్ల నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పంట మార్పిడి చేయడం వల్ల చీడపీడలను తగ్గించవచ్చని అని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గంగా మల్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

భూ భారతి పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మద్దుల్‌వాయి గ్రామంలో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును సోమవారం మెదక్ ఆర్డీఓ రమాదేవి పరిశీలించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ సింధూరేణుకను అడిగి తెలుసుకున్నారు. ప్రజల భూముల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కోరారు. కార్యక్రమంలో గిర్దావర్ ఆబేద్, సిబ్బంది ఉన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

రాయికోడ్(అందోల్): పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి సారిక అన్నారు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, పద్మ, ఉద్యానాధికారి మౌనిక సోమవారం రాయికోడ్‌లోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడులు పొందడానికి అధికారుల సూచనలు పాటించాలన్నారు. డీఏపీ యూరియా వినియోగం మోతాదుకు మించొద్దన్నారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ సభ్యుడు బక్కారెడ్డి, ఏఈఓలు నిఖిల్, శివ, కల్పన, దీపిక, భావన , రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులతో రైతులకు ప్రయోజనం

ఆర్డీఓ మహిపాల్



నర్సాపూర్‌రూరల్: దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహిపాల్

నర్సాపూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులను సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ మహిపాల్ సూచించారు. మండలంలోని రుస్తుంపేటలో సోమవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో తమ భూములకు సంబంధించి తప్పులు ఉంటే దరఖాస్తులు చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సదస్సులో 70 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సిద్ధిరాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

217 దరఖాస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): రెవెన్యూ సదస్సులో 217 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలోని సలాబత్‌పూర్‌లో తహసీల్దార్ ఆంజనేయులు, అంతారంలో డిప్యూటీ తహసీల్దార్ జహీర్, రెవెన్యూ సిబ్బంది సదస్సు నిర్వహించారు. సలాబత్‌పూర్‌లో 160, అంతారంలో 57మంది రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, రెవెన్యూ అధికారులు లక్ష్మణ్, కవిత, వెంకటేశం, ప్రియాంక, బాలమణి, మహేశ్, కరుణాకర్, శంకర్, నర్సింహులు పాల్గొన్నారు.

102 దరఖాస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 102 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కమలాద్రి, ఉప తహసీల్దార్ షఫీయొద్దిన్ చెప్పారు. ఐదో రోజు మండలంలోని గుండ్లపల్లి, బిజ్లిపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గుండ్లపల్లిలో 67, బిజ్లిపూర్‌లో 35 దరఖాస్తులు వచ్చాయని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషన్, సిబ్బంది ఉన్నారు.

జీలుగతో భూమి సారవంతం



కొల్చారం(నర్సాపూర్): రైతుల పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): నేల సారవంతానికి జీలుగ సాగు ఎంతో ముఖ్యమని మండల వ్యవసాయాధికారి శ్వేతాకుమారి చెప్పారు. రంగంపేట రైతు వేదికలో సోమవారం ఆమె రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న జీలుగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తొలకరి వర్షాల వేళ జీలుగను పచ్చిరొట్ట ఎరువుగా వాడేందుకు భూముల్లో ముందస్తుగా సాగు చేయాలన్నారు. ఇది భూమికి అవసరమైన పోషకాలను అందిస్తుందని చెప్పారు. ప్రతిరైతుకు ప్రభుత్వం రైతు గుర్తింపు కార్డు అందిస్తుందని, వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్ గౌడ్, ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు సిద్ధం

నర్సాపూర్: సబ్సిడీపై అందజేస్తున్న జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి దీపిక తెలిపారు. ఆమె మాట్లాడుతూ 30కిలోల విత్తనాల బస్తా రూ.2,137కే అందజేస్తారని, ఒక బస్తా విత్తనాలు రెండున్నర ఎకరాలకు సరిపోతాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌బుక్‌తో కార్యాలయానికి వచ్చి పొందవచ్చని చెప్పారు.

ప్రభుత్వ భూమి కబ్జాను అడ్డుకోండి



ప్రభుత్వ పానాదిలో రాళ్లను అడ్డుగా పెట్టిన దృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని అందుగులపల్లి శివారులోని మ్యాకల బండ ఆక్రమణకు గురవుతోంది. సుమారు ఎకరా ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్, వ్యయసాయ పొలాలకు వెళ్ళకుండా ఉన్న పాత పానాదిని ఆక్రమించడానికి రాళ్ళు అడ్డుగా పెట్టి దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి అక్రమ కబ్జాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్యాక్రాంతమైన అటవీ భూమి స్వాధీనం



భూమిని స్వాధీనం చేసుకున్న అటవీ సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని చుట్టూ కందకం పనులు పూర్తి చేశామని సెక్షన్ అధికారి శ్రీధర్‌కుమార్ తెలిపారు. మండల పరిధి బోజ్యా పంచాయతీ జెంగ్యాతండా శివ్వంపేట సెక్షన్ పరిధిలోని దొంతి కంపార్ట్‌మెంట్‌లోని 348లో అటవీ భూమిని తండాకు చెందిన వారు వారం రోజుల క్రితం కబ్జా చేసి తున్నకం చేపట్టారు. విషయం తెలుసుకున్న సిబ్బంది జేసీబీల సాయంతో అక్కడ కందకం తవ్వకం పనులు చేస్తుండగా ఆక్రమణదారులు గొడ్డలితో సిబ్బందిపై దాడికి యత్నించారు. దీంతో పోలీసుల సహకారంతో నర్సాపూర్ రెంజ్ అటవీ సిబ్బంది భూమి స్వాధీనం చేసుకున్నారు.

మార్వాడీ దుకాణాలను విస్తరించొద్దు



స్వచ్ఛందంగా బంద్ పాటించిన దుకాణాదారులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రమైన వెల్దుర్తిలో రోజురోజుకూ మార్వాడీ దుకాణాలు పెరగడం వల్ల తమకు గిరాకీలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వర్తక, వాణిజ్య సంస్థల నిర్వాహకులు ఆరోపించారు. మండలంలో ప్రస్తుతం ఉన్న దుకాణాలు కాకుండా కొత్తగా ఏర్పాటు చేయబోమని గతంలో హామీ ఇచ్చిన మార్వాడీలు మాటమార్చి నూతనంగా హార్డ్‌వేర్ దుకాణం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం గ్రామంలో బంద్ చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు.

పేదోళ్లమని అడ్డుకుంటున్నారు..



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న బాధితులు



అప్పట్లో కట్టిన పన్ను పత్రం చూపుతున్న బాధితులు

- మా భూములు మాకు ఇప్పించండి
- బుడగ జంగాల కుటుంబాల ఆవేదన

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం ఇచ్చిన భూముల్లోకి వెళితే.. తామను అడ్డుకుంటున్నారు. అదే భూమిలో ధనికులు బోర్లు వేసి తోటలు వేస్తే దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. మాకు న్యాయం చేయండి అంటూ బాధిత బుడగ, జంగాల కుటుంబీకులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. బాధితులు కథనం ప్రకారం.. మెదక్ పట్టణంలోని దుబ్బతోటలో నివాసం ఉండే 56 బుడగ, జంగాల కుటుంబాలకు 1960లో భూపోరాట యోధుడు కేవల్‌కిషన్ ఆధ్వర్యంలో మెదక్ మండలం రాయిన్‌పల్లి శివారులోని 226, 227, 228, 229 సర్వే నంబర్‌ల్లో 365 ఎకరాల భూమిని ఇప్పించారు. దీంతో కొన్నేళ్ల పాటు బుడుగ జంగాల ప్రజలంతా అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగించారు. అక్కడ ఎలాంటి వసతులు లేకపోవడంతో అనేక అవస్థలు పడ్డాం. ఆ భూములకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. అందుకు పన్నులు కట్టిన రశీదులు కూడా ఉన్నాయి. అప్పటి ప్రభుత్వం కొన్నేళ్ల తరువాత స్పందించి వాగు అవతల ఉన్న బంజప్ప అనే వ్యక్తికి చెందిన మూడెకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి మాకు ఇల్లు కట్టించి ఇచ్చింది. ఈ క్రమంలో వాగు పొంగడంతో వాగు అవతలి పొలాల్లోకి వెళ్లడానికి వంతెన లేక ఆరు కిలో మీటర్ల దూరంలోని కోంటూర్ మీదుగా వచ్చి పొలాలు చూసేవాళ్లం. అక్కడే గాంధీవిగ్రహం, హనుమాన్ ఆలయం ఉంది. కొన్నాళ్లకు బుడగ, జంగాల కుటుంబాల్లో విభేదాలు రావడంతో పెద్ద ఎత్తున గొడవలు జరిగాయి. దీంతో ఒకరి ఇళ్లు ఒకరు తగులబెట్టుకున్నారు. చాలా మంది పట్టాలు ఆ మంటల్లో కాలిపోయాయి. అనంతరం అక్కడి నుంచి కొంతమంది మెదక్ పట్టణంలోని గాంధీనగర్, నర్సిఖేడ్ ప్రాంతాలకు తరలివెళ్లి అక్కడే నివాసం ఉంటున్నారు. అయితే మా భూముల్లోకి మేము వెళ్లి సాగు చేసుకుంటే ఫారెస్ట్ అధికారులు వచ్చి అడ్డుకుంటున్నారు. ఇతరులు వచ్చి మా భూముల్లో బోర్లు వేసి, కబ్జాచేస్తే వారిని అడ్డుకోవడం లేదని తెలిపారు. తహసీల్దార్, ఆర్డీఓలకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో మాకు న్యాయం చేయాలంటూ చిత్తారి పోచయ్య, నర్సింలు, లక్ష్మి, ఏసయ్య, రవీందర్, రాములు, గోపాల్, శంకర్, జయందర్, భిక్షపతి తదితరులు వేడుకుంటున్నారు. ఈ విషయంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మనోజ్‌ను వివరణ కోరగా బుడగ జంగాల ప్రజలకు భూములున్న ఉన్నమాట వాస్తవే. కాని వారి భూములను ఇతరులు ఆక్రమించడంతో వాళ్ల ఫారెస్ట్ భూముల్లోకి వస్తున్నారు. జాయింట్ సర్వే చేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

టేక్మాల్(మెదక్): మైనార్టీల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా మైనారిటీ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఏ సలీం మండిపడ్డారు. సోమవారం టేక్మాల్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ఈసారి కూడా ముస్లిం మైనారిటీ వర్గానికి నిరాశే మిగిలిందన్నారు. మంత్రివర్గంలో మైనార్టీలకు చోటు దక్కకపోవడంతో ముస్లింలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు.

దుర్గమ్మ సేవలో నటుడు నరేష్



పాపన్నపేట(మెదక్): ప్రముఖ సినీ నటుడు నరేష్ సోమవారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్నారు. అర్చకులు పార్థివ శర్మ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి కుటుంబ సభ్యుల పేరిట అర్చన, ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ ఆలయ విశిష్టతను అర్చకులు ద్వారా తెలుసుకున్నారు.

నేడు ఓటర్ జాబితా అభ్యంతరాలపై సమావేశం

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజిపల్లి, గడ్డపోతారం, మాదారం, వాలిలాల, లక్ష్మీపతిగూడెం గ్రామాల్లో 18 వార్డులకు సంబంధించిన ఓటర్ జాబితాపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జైత్రంనాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఓటర్ జాబితా అభ్యంతరాలపై మాజీ ప్రజా ప్రతినిధులు అఖిలపక్ష నాయకులు, యువకులు గ్రామ ప్రజలు నేడు11: 30 గంటలకు మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో వ్యక్త పరచవచ్చని అన్నారు.

ఖేడ్‌లో కుండపోత వర్షం



జాతీయ రహదారిపై పారుతున్న వరదనీరు

నారాయణఖేడ్: డివిజన్ పరిధిలో సోమవారం ఉదయం రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా కుండపోతగా వర్షం కురిసింది. మనూరులో 42.4 మి.మీలు, ఖేడ్‌లో 35, నాగల్గిద్దాలో 34.6, నిజాంపేటలో 27.4, కంగ్టిలో 24, సిర్గాపూర్‌లో 9.4, కల్హేర్‌లో 6.8 మి.మీలుగా నమోదైంది. మనూరు, ఖేడ్, నాగలిద్ద మండలాల్లోని ఆయా వాగుల్లోకి భారీగా వరద నీరు చేరింది. ఖేడ్ పట్టణంలోని జాతీయ, ప్రధాన, అంతర్గత రోడ్లపై భారీగా వరదనీరు పారింది.

జీవితంలో యోగా భాగం కావాలి



అవగాహన కల్పిస్తున్న యోగా శిక్షకులు భరత్

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆయుష్ శాఖ యోగా శిక్షకులు మద్దెల భరత్ యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆసనాలు వేయాలని సూచించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసనాలు వేసి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు అప్పగించాలని నిరసన



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

జహీరాబాద్ టౌన్: డబుల్ బెడ్ రూం ఇళ్లను అప్పగించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హోతి(కె) గ్రామంలో పేదల కోసం ఇళ్లను కట్టించగా అధికారులు డ్రా ద్వారా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారని చెప్పారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్లను అప్పగించడం లేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి వెంటను ఇళ్లను అప్పగించాలని, లేనిపక్షంలో ఇళ్లను అక్రమించుకుంటామని హెచ్చరించారు. స్పందించిన తహసీల్దార్ దశరథ్ ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో ఇళ్లను అప్పగిస్తామన్నారు. దీంతో ఆందోళన విరమించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

విజిలెన్స్ ,ఎన్ఫోర్స్‌మెంట్ ఏఐజి మధుకర్



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

వట్‌పల్లి(అందోల్): రైతులకు ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఐజీ మధుకర్ అన్నారు. సోమవారం మర్వెల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్ వివరాలు ,రసీదు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల ధర పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాపారులు కల్తీ విత్తనాలు అమ్మకూడదని ప్రభుత్వ గుర్తింపు ఉన్న నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. విజిలెన్స్ ఏఓ కోటేశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని 41 మంది లబ్ధిదారులకు మంజూరైన 19 లక్షల 85 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి అండగా ఉంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

జిన్నారం (పటాన్‌చెరు): ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో రూ.12.10 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. గుమ్మడిదల నగర కేంద్రం జాతీయ రహదారి నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు రూ. 42. 50లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజలు



ఇళ్ల సర్టిఫికెట్లను అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. మండల్ తాద్దన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ నేత నత్తి దశరథ్ మాట్లాడుతూ.. తొలి విడతలో గ్రామంలో ఎనిమిది ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇది నిరంతరమైన ప్రక్రియ అని విడతలవారీగా అర్హులందరికీ ఇళ్ల మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, హౌసింగ్ ఏఈ శ్రీదేవి, గ్రామపంచాయతీ సెక్రటరీ సిద్ధమ్మ, మండల మైనార్టీ ప్రెసిడెంట్ ఎండీ మౌలానా, మాజీ ఎంపీటీసీ ఈశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీహరి, కాంగ్రెస్ మండల నాయకులు గణేష్ , గ్రామశాఖ ఉపాధ్యక్షుడు బాలరాజ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నెలాఖరు వరకు బియ్యం పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): ఈ నెలాఖరు వరకు మూడు నెలలకు సంబంధించి సన్నబియ్యం పంపిణీ జరుగుతుందని ఉప తహసీల్దార్ షఫీయొద్దిన్ చెప్పారు. సోమవారం ఆయన మండల పరిధి బిజ్లిపూర్‌తోపాటు పలు గ్రామాల్లోని రేషన్ దుకాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు రాకుండా డీలర్లు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ జెడ్పీ మాజీ చైర్మన్ మృతికి సంతాపం

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్, నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డి.రామకృష్ణ మృతికి పలు పార్టీల నాయకులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పబ్బ రమేశ్‌గుప్తా, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావుతోపాటు పలువురు నాయకులు రామకృష్ణ భౌతికదేహం వద్ద నివాళులర్పించారు.

◆ పోగొట్టుకున్న మొబైల్ అందజేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): రెండేళ్ల క్రితం పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశామని ఎస్ఐ నర్సింహులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బద్యాతండాకు చెందిన కాట్రోత్ రమేశ్ రెండేళ్ల క్రితం చిట్కుల్ శివారులో తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఫోన్ రెండేళ్ల అనంతరం సీఈఐఆర్ పోర్టల్‌లో ట్రేస్ అవ్వడంతో రికవరీ చేసి బాధితుడికి అందజేశామని చెప్పారు.

◆ కన్యకా పరమేశ్వరి ఆలయ ఉత్సవాలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం, బుధవారం నగరేశ్వర స్వామికి అభిషేకం, గురువారం సుహాసినీ పూజతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ మెరిట్ స్కాలర్‌షిప్‌కు 12 మంది విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మోడల్ పాఠశాల విద్యార్థులు 12 మంది నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం పరీక్షలో పాల్గొనగా 12 మంది విద్యార్థులు ఎంపికై నట్లు తెలిపారు. వారికి 9వతరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ డబ్బులు అందిస్తుందని తెలిపారు.